# మొదటి చావు

నాకు పద్మూడేండ్లు. ఇద్దరన్నలు, ఒక అక్క, ఒక తమ్ముడు ఉన్నారు. మా అన్నదమ్ముల కెన్నేండ్లని అడ్గిన గూడ మా అమ్మ నేనెన్నడు బుట్టానో యాదికి దెచ్చుకుంటుంది. మా అమ్మ నెవ్వరన్న అడ్గిర్రనుకో... మా అమ్మ నేనెప్పుడు బుట్టిన్నో యాదికి దెచ్చుకుంటది.

ఎందుకంటే నేనెన్నడు బుట్టిన్నో మా అమ్మకె గాదు. మా బస్తీల అందర్కి యాదుంది. ఆ దినం సీటంత బందు వెట్టిర్రు. లొల్లి లొల్లి అయ్యింది.

అవ్వదామల్ల! ఇందిరమ్మనెవలో జంపేసిర్రా దినం. బస్సులు, ఆటోలు, యేయి దిర్గుత లేవు. దుక్నంలన్నీ బంద్. మా నాయ్న యేడ సిక్కుపడిండో దెల్వదు.

ఇగప్పుడు ఆ అమ్మ మొత్తుకొనుడు షురూ చేయబట్టె. యేందంటే కడ్పులకెల్లి భూమ్మీద వడ్తనని నేను లొల్లి జేసిన్నంట. నా దిక్కెల్లి మా యమ్మ నగుల పాలయ్యిందంట. అమ్మ యేడ్పులు, మొత్తుకొల్లు జూసి యేదయ్యితే గదయ్యితది రిచ్చెక్కమని మా మామ రిచ్చ దెచ్చిండు గని ఆ రిచ్చనే యెక్కలేని అమ్మకి యాష్టకొచ్చింది.

నల్గురు బట్టి యెట్టనో యెక్కిచ్చిర్రు. సందుల్ల గొందుల్ల తిరుక్కుంట మామ రిచ్చను దవాఖానాకి తీస్కబోయిండు. ఆ దినాల ముచ్చటెన్నడొచ్చిన ఇదే మాట-

"ఆ ఇందిరమ్మ సావుకెంత నెత్తురు గారిందొ, ఈ ఇందిరమ్మ పుట్కకంత నెత్తురు గారె" అంటాడు మామ.

అనడా మల్ల! ఆ రిచ్చనంత నెత్తురేనంట మల్ల! పాపం అమ్మ నన్ను గననీకి శాన కష్టపడింది.

"ఇందిరమ్మ పేరు పెట్టుకున్నవు నీ బిడ్డెగూడ ఆ అమ్మ లెక్క సక్కగుంటదె... దాని మొకంల లచ్చిందేవి కల" అని యెప్పుడెవలోకలు నా దిక్కు జూసుకుంట మా అమ్మతోని అనేటోల్లు.

నాకు మస్తు ఖుషీగుండెడ్దిగని మా అమ్మ ఆల్లున్నప్పుడు నగి ఆల్లటు పోంగనె-

"పాడు కల్లమ్మ! బిడ్డకేమైతదో"ననుకుంట దిష్టి తీసేది. నేను అద్దంల జూసుకుంట నవ్వుకునేది.

అంతట్లనె అమ్మ "నవ్వద్దు, నవ్వద్దు. పైయ్యోడు కల్లల్ల అగ్గి పెట్టుకుంటడు" అంటది.

"పైయ్యోడెవలమ్మా?" అని నేనడ్గితే,

"పైనుంటడు బమ్మదేముడు. నువ్ నగితే 'అచ్చ! నవ్వతవ బిడ్డ' అని యేడ్పిస్తడు. గందు గురించి ఎక్వ తక్వ నవ్వొద్దు బిడ్డా! లే లేసి పంజూడు" అనేది గని,

“ఆ బమ్మకి దమాక్ లేదా” అని సోంచాయించేదాన్ని.

ఆడిపిల్లలు నవ్వితె యెంతందంగ వుంటరు. హు- యేం దేవుడో మాయదారి దేవుడు.

మా అక్క బావ సిద్దిపేట్ల వుంటరు. మా పెద్దన్న వదినెమ్మలు వేరే వూర్ల వుంటరు. మా చిన్నన్న మెదక్ కంపెన్ల భర్తీ అయ్యిండు. ఇగ మా తమ్ముని ఆస్టల్ల జేర్పించినం.

“పురుగులన్నమే” అని వాడెప్పటికి యేడుస్తుండే గని, “యేదో ఒక అన్నం, ఓ నాల్గేండ్లు యెట్లనో కండ్లు మూసుకుంటె నాలుగచ్చురం ముక్కలు నోట్ల పడతైగదా” అంటది అమ్మ.

ఇట్లుంటె మంచిగనె. కాని రోజులెన్నట్కి మంచిగుండవ్ గదా – మా నాయ్న రిచ్చాని లారీ గుద్దిపాయె. కాలిరిగి నాయ్న మంచంల బడ్డడు. అమ్మ నాలుగిల్లల బాసన్లు దోమొస్తది. మల్ల పండ్లమ్ముడు షురూ జేసింది. పొద్దుందాక పండ్ల బుట్టలేస్కుని బజార్లంట తిరిగి అమ్మేడిది. నేను పదకొండేండ్లకే పెద్దమన్సినయిన!

అప్పట్సంది అమ్మ ఒక్క తీర్గ కన్పిస్తలేదు. అప్పుడె నవ్వుతది. అప్పుడే గుర్రుమంటది.

“నేనేం జేసిన్నే” అంటె

“నువ్వేం జెయ్యాలె బిడ్డా! నా గాచారం బాగాలే” అంటది.

“ఏమయిందమ్మా” అంటే

“ఏమైతదోనని పరేశాన్” అంటది.

“పురా పద్మూడేండ్లు లెవ్వుగని పద్దెన్మిదేండ్ల పోరి లెక్కున్నవ్” అంట గునుస్తది.

అప్పుడంత అమ్మ సూపు నా ఛాతీ దిక్కే వుంటది.

దీన్ల నా తప్పేముంది మల్ల. “నీదేం తప్పమ్మ. నీదేం లేద”ని అమ్మే అంటది. గని పరేశానవుతనే వుంటది.

కండ్లు దుద్సుకుంట, ముక్కు పీల్సుకుంట ఉంటది. ఇదంత నాకు భీ ఆదత్ అయిపోయింది.

అమ్మ పొద్దుగాలా పొద్దుగాల యిండ్లల్ల పనిజెయ్యనీకి వురుకుతది. వస్తనే పండ్ల గంప దీస్తది. మల్లొచ్చి జర్రంత దిని అట్ల అడ్డం వర్గతది. మల్ల లేసి ఉర్కిందంటే యే రాత్రో... వస్తనే నన్ను జూస్తది.

ఆ చూపే అదో తీర్గ వుంటది. ఎట్లుంటదంటే యేమోగని అమ్మ బైటికెల్లినగని ఆమె నన్ను జూస్తనే వున్నట్టుంటది.

ఎందుకట్ల జూస్తదో నాకు సమజయిత లేదు.

నేను భీ పొద్దుగాల్లేస్తే పొద్మ్యాకేదంక పంజేస్తనే వుంట. ఇంట్ల బాసన్లు నేనే దోంతా. ఇల్లంత జాడు గొట్టి అన్నం గిట్ల వండుత. నాయన పన్లన్నీ నేనే జూస్త!

ఇన్ని జేసినగనీ... నేనెన్నడన్న దోస్తుల్తో జర్రంత సేపు మాటలు జెప్పుకుందామన్న అమ్మ వద్దంటది. నాయనయితే ఆయన కల్లముందే వుండాలె. లేదంటే కస్సుమంటడు. మంచంల వున్నడుగానీ రోషం తగ్గలే! అమ్మో!

ఇజయ, రమ, షకీల యెన్నడన్న సీన్మకు బోదం అంటరు. నాయనొద్దంటడు. యేదన్న పండుగకు అమ్మతోనే ఎల్లాలె, అమ్మతోనె రావాలె. గంతనే.

నా దోస్తులెప్పుడన్న యింట్లకొచ్చి మాటలు పెట్టుకుంటే జ(రసేపు జూసి "అరె యేం లొల్లి జేస్తున్రే. పోంరి, పోంరి" అని లొల్లి జేస్తడు నాయన. నన్ను పోవద్దంటరు గద! మల్లెప్పుడో అల్లే వస్తరు. మల్లి షురూ కత. నాయన అమ్మకి జెప్తడు. అమ్మ నా నెత్తిమీద నాలుగేస్తది. నేనేడుస్త. జ(రసేపు జూసి,

"ఇగసాలు తియ్ యేడ్పు" అంటది అమ్మ.

ఇదేంది సాలంట సాలు. యేమన్న కొలతనా కిలోల్లెక్క? నాకింకింత యేడ్పొస్తది.

ఇగనప్పుడు అమ్మ "ఊకో బిడ్డా వూకో! నాకు భీ యేడ్వనీకొస్తది. నేనేడుస్తున్ననా! వూకో" అంటది.

నేనాపిన్నా సరే వుంటది. ఎన్నడన్న నాకేడ్పు ఆగక యేడుస్తనే వుంట.

"ఆసేయ్. ఇంగ నేను షురూ జేస్త. అగర్ నేను గిట్టయేడవ బట్టిన్ననుకో, నువ్వు, నీ అయ్య, నీ అన్నల్దమ్ములు, అక్కలు, బస్తీల అందరూ జావాలె నా యేడుపు ఆపనీకి. నా కడుపుల అంత యేడుపుంది. యేమనుకుంటన్నవో– ఆపు ఓ పోరీ" అంటది.

అంతె. నా యేడుపెటుబోతదో నేను మా అమ్మ దిక్కు జూస్త. మా అమ్మ నా దిక్కు జూస్తది. యేమనుకుంటదో యేందోగని మల్ల దగ్గర్కి దీస్కోని,

"యేంది బిడ్డా పిచ్చిదాన్లెక్క గట్ల జూస్తున్నవ్. యేడుస్తననా; యేమేడ్వను తియ్. యేడువాలంటే ఈ బస్తీల ప్రతొక్క ఆడుది యేడుస్తది. ఆడుదాని కడుపుల పేగులుండవ్. ఆడుదాని కడ్పునిండా యేడుపులే పేగుల్లెక్క సుట్టల్ చుట్టల్‌గుంటయ్ బిడ్డా. యేడ్వనీకి అందర్కి అన్ని పరేశాన్‌లున్నయ్ గని యేడ్వరు. యెందుకో యెర్కేనా?"

అంతట్లనే మా నాయన,

"నీ యవ్వ, షురూ జేసినవ్ రామాయనం. ఆ పిల్ల మొకంజూడు. దాన్ని బుగుల్తో జంపకు" అంటడు.

నేను గాలి పీల్చుకుంట.

నాయనకు మందు తినిపిస్తనే వున్నం. మందుల్దింటె రోగం తక్వగావాలె గద. గనీ రోగం ఎక్వగానికే యిచ్చిర్రేమో, ఇక మా నాయన్ని దవాఖానాకి తీస్కబోయి జేర్పిచ్చినం. లేకుంటే బత్కడన వట్టిరి. నాయనకు దవఖాన్లో పెట్టిన్రని దెల్సి అన్నలు అక్క అందరు వచ్చిను. పోయింర్రు. ఎన్నాల్లుంటరు? కొలువులాయె!

మా నాయన్తాన దవాఖాన్ల అమ్మ వుంటది. నేను యింట్ల పన్లన్ని జేసి అమ్మ రాంగనే అన్నంబెట్టి జ(రంత దవాఖాన్కి పెట్టిస్త. అమ్మ నాయన గురించి గాక నా గురించి యేడ్వబట్టె.

"నేనేం సిన్నపిల్లనా! పెద్దగయిన గదా! నా గురించి నువ్వెందుకు బుగుల్ పడ్తున్నవ్?" అంటే,

"నువ్వు సిన్నపిల్లవైతే నేనెందుకు బుగుల్‌పడ్త. పెద్దగయినవనే నా పరేశాని" అంటది అమ్మ.

"నా గురించి నువ్వు చింత పడకమ్మా" అంట.

"మంచిది బిడ్డా. నేనేం చింతపడ. నువ్వయితే జర హొషియార్‌తో నుండు బిడ్డా. ఆడ పిల్లలు అడివులుండాలె. బస్తిల ఉండొద్దు. బస్తీలల్ల మొగోల్లు పీక్కోని తింటరు" అంటది.

అమ్మ బాసాన్లు దోమే యింట్లకు నేను బోవడ్తి... లేకుంటె ఆ యిండ్లన్ని బోతయ్ గద! గందుకని మూడిండ్లల్ల నేనే పని చేయవడ్తి.

మా అమ్మకన్న నేనే బాగా జేస్తనని అమ్మ గార్లందరనపట్టిరి. నాకు ఖుషీగనిపించి యింక మంచిగజేస్తున్న. పని జెయ్యడం నాకేం కొత్తనా!

బాసాన్లు తోమితోమి టీ.వీ. అడ్‌మెంట్లల్ల జెప్తరే గట్ట తలతలలాడిస్త.

బట్టలు మల్లెపువ్వులెక్క వుత్కత.

జాడుగొట్టి తుడ్సిన్నంటె ఇల్లు అద్దమోలె మెరవాలె! ఆ యిండ్లల్ల మొగోల్లు గూడ పీక్కు తింటున్నట్టె జూడ వట్టిరి. అమ్మగార్లు నా యెంట తగిలి వుండబట్టి గని లేకుంటె ఆ మూడిండ్లల నా పని ఖతమయ్యేడిది.

ఇండ్లల్ల పన్లన్నీ జేసొచ్చి మంచిగ తానం జేసి, వుత్కిన బట్టలు గట్టుకొని, నెత్తి దువ్వుకుని, పౌవుడర్రాసుకోని, కండ్లక్కాటిక బెట్టుకుని, ఇండ్లల్ల దెచ్చుకున్న బంతిపువ్వో, మందారం పువ్వో బెట్టుకుని, అద్దంల జూసుకుంటె యిగ వుంటది మజా!

చేసిన కస్టమంత చేత్తో తీసేసినట్లే.

అద్దం మీద పడిన పవుడరు వూదేసినట్టే!

మనసుకి ఆయిగా సుకంగుంటది.

అప్పుడు మనకిక నవ్వొస్తది. నవ్వుతోపాటే అమ్మొస్తది. నన్ను నా నవ్వుని చూస్తది.

ఒక్కసారి దగ్గరకు తీస్కుని,

"సాయిత్రి లెక్కున్నవ్ బిడ్డా" అని ముద్దిస్తది.

అంతట్లనె యేమయితదో యేమో,

"పాడు లోకం. నిన్నేంజేస్తదో బిడ్డా" అని కల్లల్లో నీల్లు.

ఇక నాకు నవ్వంత పోతది.

మా అమ్మకి యే దేముడైన కన్పడి యేం గావాలని అడ్గితే –

"దవాఖాన నుంచి నా మొగున్ని ఇంటికి బంపాలె. నా బిడ్డ పెండ్లి జెయ్యాలె" అని దప్ప యిగ మరేం అడ్గదు. నాకెరికే!

ఒకనాడు పగటి పూట నేనన్నందిని బాసాన్లు తోముద మనుకుంటుంటే మా యింటెదురెంగ క్రమల వుండె రాజయ్య వొచ్చిండు.

"ఒక్కదానివే ఉన్నావా?" అన్నడు.

తలూపిన!

"శాన మంచిగున్నవ్" అన్నడు.

నేను పుట్టినప్పట్సంది యింటనే వున్నగద! ఏమన్లే!

"సీన్మల్ల ఈరోయిన్లెక్కున్నవ్"

"ఏం గావాలె" అన్న

"మీ నాయనకెట్లున్నది?"

"తక్వ గాలె" అన్న.

"చస్తడో యేమొ ముండాకొడుకు"

"యేంది గట్టంటవ్"

"ఏమన్న? చస్తడో బత్కుతడో అన్న" అని వురికొచ్చి నా చెయ్యి బట్టుకున్నడు. చెయ్యి యిదిలించుకున్నా. ఆడు నన్ను మీదిగ్గుంజుకుని కౌగలించుకున్నడు.

నాకు బయం, రోతబుట్టి లొల్లిబెట్టిన.

వాడెట్ల వురికిండంటే –

నాకింక బాగ యేడుపొచ్చింది. యెందుకో తెల్వదు గానీ, పెయ్యంత మంటలు. అంతట్లనే చెమటలు.

ఒల్లంత చితచిత లాడబట్టే.

శానసేపట్లనే పండుకున్న. ఏంచేస్తన్ననో యేమయితున్నదో తెల్వదు. అమ్మ వచ్చినంక జెప్పాల్నా –

జెప్తే నన్ను కొడ్తదా – నేనేం జేసినా, నేనేం జెయ్యకపోయినా తిడ్తది. కొడ్తది.

నన్నెందుకు తిట్టాలె. వచ్చింది ఆడుగద! యేమన్న జేస్తే ఆడ్ని జెయ్యాలెగని. జూస్తున్న గద ఆడోల్లనే అంటరు యేది జర్గిన.

చెడ్డంత ఆడోల్లు, మంచంత మొగోల్లు.

దునియనే గట్లుంది.

ఎంతదనుకట్లున్ననో అమ్మ వచ్చింది. నాయనకి తక్వయిత లేదని జరసేపు యేడ్సింది.

ఎప్పట్లెక్క రాంగనే నా దిక్కు చూస్తే నే జెప్పకున్న తెల్సిపోయేదేగని, అమ్మ నా దిక్కే జూళ్లే –

అప్పట్సంది రోజూ తలుపు గొల్లెం పెట్టుకోని యింట్ల బుగుల్తో వుంటున్న. నాల్గయిదు రోజులు జర్గినయ్. ఎవ్వరు రాలే.

ఆ దినం నేను లొల్లి జేస్తనని వురికిండుగదా యింక రాడనుకున్న.

వారం రోజులా తీర్గ జర్గినయ్. నేను రాజయ్య సంగతి మర్చిపోయిన గని, ఆడు ఆ రాజయ్య బాడఖవ్‌గాడు మరవలె.

మల్లొకనాడొచ్చిండు. వస్తనే తలుపు గొల్లెం పెట్టిండు. నేను అరవనీకి నోరు తెరిస్తే, ఆని నోటితోని మూసేసిండు. ఆడు నామీన్నించి లేచెల్లె తలికి నేను చచ్చిన్నో బతికిన్నో తెల్వలే.

అసలేం జేసిండో నాకు సమజయితనే లేదు.

నా వొల్లంత ఆగమాగమయ్యిందని తెలుస్తుంది. అమ్మ వచ్చే తలికిట్లనే ఉంటే అమ్మ గుండె పలిగి సస్తదని తెలుస్తుంది.

పనికి బోలె. అట్లనే పడ్కున్న.

యేడుపుగూడ వస్తలేదు.

అమ్మతో జెప్తే ఏం జేస్తది, కట్టె దీస్కొని కొడ్తదా? బాయల నూకుతదా? నెత్తిగొట్టుకుని యేడుస్తదా?

చీకటయింది. అమ్మొస్తదిగ.

నాకు లేవనీకొస్త లేదు. అమ్మని రానీ. ఏమైంది బిడ్డా అని అడ్గనీ– అంత జెప్త.

నన్నేం జెయ్యొద్దని దండంబెట్టినా యినకుండా ఆడు నన్నెట్ల కింద పడేసిండో జెప్తా.

నేను ఆడ్ని నూకేస్తంటే చేతులెట్ల యిరిసిండో జెప్తా.

అమ్మ యేడుస్తది. నేను భీ యేడుస్త.

నా కేడుపెందుకొస్త లేదో సమజైత లేదు గని,

గాలి పీల్సుకుందుకు కష్టమెందుకైతంది?

నేను చచ్చిపోతా గావచ్చు. అమ్మ యింక వస్తలేదేంది?

చూస్తనే వున్న, అమ్మ వస్తనే లేదు.

అమ్మ రాలేదుగనీ – మా పక్క పొంటెనుండే శాంతమ్మ వచ్చింది.

వస్తనే నన్ను జూసుకుంట "ఎంత కష్టమొచ్చిందే బిడ్డా!" అనుకుంట నన్ను పట్టుకోని యేడుస్తుంటే,

"ఈమెకెట్ల తెల్సింది? నేనెవరికీ చెప్పలేదే – ఆ రాజయ్యగాడె అందరికీ చెప్పిండా నేనిట్ట జేసిన్నని –" అనుకుంట నేను గూడ యేడవబడ్తి.

ఆమె యేడ్సుకుంట మా నాయన ముచ్చట్లు, ఆయన మా బస్తిల యెవలెవలికి యెంతెంత మంచి చేసిండో, యెవరెవరికి మద్దతిచ్చిండో... కొసకు యిప్పుడెట్ల జచ్చిపోయిండో చెప్పుకుంట యేడుస్తుంటే తెల్సింది శాంతమ్మ యెందుకేడస్తందో –

మా నాయన జచ్చిపోయిండు. నా గుండె పగిలేటట్టు యేడ్సిన.

మా నాయన నన్ను తిట్టినాగని, మా నాయనకు నేనంటే పానం. నాగ్గూడ మా నాయనంటే శాన యిష్టం.

మా నాయన నా కష్టం తెల్వకుంటనే సచ్చిండు.

గని, నా కస్టం, మా నాయన కస్టం కల్సి గూడా నేనా దినంయెట్ల బదికిన్నో నాకే దెల్వదు.

చచ్చిపోయిన నాయన్ను తీసుకుని వచ్చి్రు.

అమ్మ యేడుపు, నా యేడుపు, బస్తీలల్ల ఆడోల్ల యేడుపులు... యేడుపులు...

అన్నలు, వదిన్లు, అక్క, బావ, తమ్ముడు అందరొచ్చి్రు. యేడ్సి్రు. మా నాయన్ను కాస్టంల కాలబెట్టి ఆకరిసారి అందరం మా నాయన కాల్లు మొక్కినం.

సావుకొచ్చినోరంతా పోయి్రు.

మా అన్న నన్ను, అమ్మను తన తానికి రమ్మన్నడు.

మా అమ్మకిష్టంలేక "నీకెందుకు బిడ్డ కస్టం! అయ్య జంపాయించిన యిల్లున్నది. యెట్లగో నాల్గిండ్లల్ల పని జేసుకుంటనే వున్నం. గట్లనే బత్కుతం. పండ్గకో, పబ్బానికో గిట్లనే వస్తపోత వుండు్రి" అనింది.

నాయిన బోయిన సంది అమ్మ పెయ్యిల మంచిగ లేదు.

నేనిగ యింట్ల పని, బైట బాసన్ల పని, అమ్మ పనులల్లబడి యిగ ఆ రాజిగాని సంగతే మర్సిన.

అమ్మ పాపం జర మంచిగయ్యి లేసి తిరిగేతప్పటికి నెల రోజులయింది.

అమ్మ కూరగాలమ్ముడు మల్ల షురువు జేసింది.

మజ్జల దసర చుట్టీల్ల తమ్ముడు వచ్చిపోయిండు.

మా దర్వాజల కెల్లి బైట అడుగు పెట్టంగనే రాజిగాని క్రమ గన్పిస్తది. ఆడు భీ కన్పిస్తడు.

ఆడ్ని జూడనికె నాకు రోత.

ఆడు నన్ను జూడంగనె నగుతడు. శరం తప్పినోడు.

ఆని నవ్వు జూస్తె ఆని మొకం మీద కాంకిరించి వూంచాలన్పిస్తది. మల్ల కాల్లు జేతులు వనుకుతై.

ఓ దినం అమ్మ నా దిక్కు అదో తీర్గ జూసుకుంట,

"ఇందిర నువ్వు బైటుండి యెన్ని దినాలయిందే!" అనింది.

నేను యాదికి దెచ్చుకున్న.

"నాయన సచ్చిపోయే దానికి పదేను దినాల ముందు"

మా అమ్మ కల్లు రొండు యింతింత పెద్దగైనై.

"రొండు నెల్లు" అంటనే బాగా బుగులుపడ్డది.

"నేనింట్ల లేనప్పుడెవలన్న వచ్చి్రా?" అనడిగింది.

"లచ్చుమవ్వ, శాంతమ్మ వచ్చి్రు".

"ఆడోల్లు గాదు. నేను నాయనతాన దవాఖాన్లున్నప్పుడు మొగోల్లెవల్లన్న మనింట్ల కొచ్చి్రా?"

మా అమ్మ నన్నిట్ల యెప్పుడడ్గలే. యెట్ల జూసిందంటే నా మనసులో వున్నదంతా ఆమెకి యెర్కయిపోయినట్టే... అట్ల... నేను గమ్మునున్న.

"సెప్పి తగలుబడు"

"యేం జెప్పాలె. రాజిగాడొచ్చిండు. నన్ను ఆగమాగం చేసిండు" అని జెప్పాలె.

చెప్దమనుకుంటున్న గని, నాకు చెప్పనీకి చెప్పనైత లేదు. మీదికెల్లి యేడ్పు.

ఇగ మా అమ్మ నా జుట్టు పట్టుకుంది. అటూఇటూ గుంజుకుంట కొట్టుడు షురువు జేసింది.

"సెప్పు... సెప్పు"

"అనుకుంటనే వున్న యెన్నడో నా కొంప ముంచుతవని, నువ్వు పెరుగుతుంటె నాకు గుబులయితనే వుంది. నువ్వ సింగారిచ్చుకున్నప్పుడల్లా అనుకున్నా ఎవని కండ్లు నీమీద పడ్తయ్యో అని, యెవడే – యెవడాడు?"

నన్ను నిలబడనియ్యది, చెప్పనియ్యది, తిడ్తనే వుంది. తిట్టుడు బంజేసి జరసేపు నా దిక్కుజూసి, "యెవడాడు. యే పేరు" అనడిగింది.

"రాజయ్య"

"యే రాజిగాడు?"

"లచ్చక్క మొగుడు" అని జెప్పి ఆడెట్లొచ్చిండో, యేమేం జేసిండో, నేనెంత యేడ్సిన్నో, అమ్మకు జెప్దమనుకుంటే నాయనెట్ట సచ్చిండో అన్ని జెప్పిన.

అమ్మ యిగ నన్ను గట్టిగా అమురుకొని,

"నా బిడ్డో! యెంత అయిరానైనవ్ బిడ్డో. నేనుండి గూడ లేనట్లాయె బిడ్డో. నీకింత కనీకరం లేకపోయినేమిరో దేవుడో. నీ గుడి గూల – నా పిల్లే దొరికెనా?" అని శానసేపు యేడుస్తనే వుంది.

రెండునెల్ల సంది నేను పడ్తున్న బాదంత తీసేసినట్లయింది. మా అమ్మ నన్ను చుట్టుకుని యేడుస్త వుంటే బాదల సుత నాకెందుకో మంచిగుంది. మా అమ్మ నన్ను గట్ల తన కడుపల దాసుకుంటే మంచిగనిపించింది. జరసేపున్నంక –

"యెవల్తోనన్న చెప్పినా దాగదు. చెప్పకున్న దాగదు. మందికి తెలిస్తే నీ పెండ్లి గాదు. తెల్వకుంటనె యేదన్న జెయ్యాలె" అంది.

"మనం జెప్పకుంటె యెట్ల తెలుస్తది" అన్న.

అప్పుడు అమ్మ జెప్పిన మాటలకు నా గుండెల బండపడ్డట్లయింది. నా కడుపుల పిల్ల పెరుగుతున్నదంట. ఆ మాట యినంగనే నా కడ్పుల పాం తిరుగుతున్నంత బయమైంది.

నాకు తెలువకుంట నా కడుపుల పిల్ల పెరుగుడేంది?

ఇంతట్టనే ఈ పిల్ల నా కడ్పులకెట్ల పోయింది?

పెండ్లయినంక గద పిల్లలు పుట్టేడ్డి!

నాకు పెండ్లేగాకపాయె! పిల్లలేడ్నించి పుడ్తరు!

నాకు పిచ్చి లేసింది. యేదీ సమజయిత లేదు. రాజిగాడు జేసిన పనికి యిట్లయిందని అమ్మ అనవట్టె.

అమ్మ దినాము యేందో సోంచాయిస్తనే వున్నది.

నేనిక యెప్పట్లెక్క బాసన్ల పనికి పోతున్న, వస్తున్నగాని యింతకుముందు లెక్క వుశార్ గుంటలేదు. తింటున్నప్పుడు, పండుతున్నప్పుడు నా కడుపు జూసుకో బుద్దయితది. అంతట్లనే జూసుకోబుద్దవ్వది.

యేమైతదో యేమో?

అమ్మ నన్ను సిద్దిపేట తీస్కబోయింది.

అమ్మ, అక్క యేందో గుసగుసలు పెట్టుకుండ్రు. మా అక్క యేడ్సింది.

"నీ మొగునికి తెల్వద్దు" అంది.

"అన్నలకు తెల్వొద్దు. వొదినకు దెలిస్తే వూరంతట్కి తెల్సినట్టే" అంది.

"అంత నే జూస్కుంట తియ్" అంది.

అక్క, అమ్మ గూడి నన్ను పెద్ద దవాఖానకు తీస్కబోయింద్రు. డాక్టరమ్మ నన్ను జూసింది. మూత్రం పరీక్ష చేయించింది. నా కడుపల బిడ్డ వుందని జెప్పి బల్లమీద పండబెట్టింది. లోపల చెయ్యిబెట్టి పరీక్ష జేసింది.

"మూడో నెల"

అమ్మ మల్లి యేడవబట్టింది. నా కేడువాల్నని వుందిగని, ఏడ్పు రాలె.

మనసులంత బుగులవ్వబట్టింది.

డాక్టరమ్మ అమ్మని "యేడ్వద్దు" అని కోపం జేసింది.

నన్ను దవాఖానల షరీకు జెయమంది.

ఒక్క దినం ఉంటే సాలు! కడ్పులకెల్లి పిండం తీసేస్తదంటె ఎట్ల దీస్తది? అప్పుడా బిడ్డను నేనేం జెయ్యాలె. దాన్నెట్ల పెంచాలె.

కడుపైతే తొమ్మిది నెలలుండాలె గద!

యేందో నాకు పిచ్చి లేస్తాంది. యేమన్న అడుగాల్నంటె బయ్యం. అమ్మ తిడ్తది.

నన్ను జూసినోల్లందరు తిడ్తుండ్రు. నేనేంజేస్తి?

రేత్రి జేర్సింద్రు దవాఖానల.

పొద్దుగాల నర్సమ్మొచ్చి "ఎలిమ"నంట అది జేసుకుంట తిట్టింది.

పాయిఖానాకు బోతుంటే ఆడో ముసలాయనున్నడు.

"గింత గింతోల్లక్కూడా కావురం యెక్కింది" అనుకుంట తిట్టిండు.

ఇంకో నర్సమ్మొచ్చి లంగూడబీకి తెల్ల గుడ్డ కప్పి -

"వొల్లు తెలియకుండా వుంటన్నరు పిల్ల ముండలు" అని తిట్టింది.

ఈల్లందరికి కోపమెందుకొస్తుందో నాకైతే సమజయిత లేదు. నన్ను పక్క రూములకు తీస్కపోయిన్రు.

ఆడ గుల్‌కోజు సీసా, ఆ బెంచి, ఆ నర్సు...

యిదంత జూడంగనే నా పని ఖతం అనుకున్న.

ఇగప్పుడు నాకే యేడనుంచో యేడుపు వచ్చి మీద పడింది. ఆ యేడుపలనే -

"నేన్‌రాన్", "నా కడుపునేం జెయ్యొద్దు. డాక్టరమ్మా", నీ కాల్మొక్తా" అని లేసి పారిపోదమని జూసిన.

నర్సమ్మ నా చెంప మీద ఒక్కటి పెట్టింది.

నా కండ్లు దిర్గినై.

"సిగ్గులేని ముండా - కడుపు దీంచుకోక పిల్లను గని పారేస్తావా?" అని తిట్టింది.

డాక్టరమ్మ కోపంతోని నా దిక్కు జూసింది.

అంతట్లనే ఒక మొగాయినొచ్చిండు.

ఆయన ఒస్తొస్తనే నన్ను గట్టిగ బట్టిండు.

ఒకామె సూదిమందు పట్టుకుని కోపంగ జూసి నాకు పొడిసింది.

మినిట్ల నా శరీరమంత తిరిగినట్లయింది. సత్కిలబడ్డట్టయింది. అందరు సుట్టూ సేరి సూత్తండ్రు.

ఈల్లంత నన్ను బాయిల నూకుతున్నరు. నన్ను సంపనీకి ఈడికి తెచ్చిన్రు. నన్ను సంపి నా బిడ్డను తీస్తే దాన్నెవలు సాకుతారు.

నేనె బాయిల పడదమనుకున్న. నా సావు నన్ను సావనియ్యకుంట ఈల్లంత కల్సి సంపుతున్నరు.

అమ్మా యేం జేస్తున్నవే- అమ్మా - యేడున్నవే - నేం జస్తున్ననే. తమ్మున్కి దీపాలి పండక్కి కొత్త అంగి కొనిద్దామని పదేను రూపాయలు దాసిన, నేను బొయినంక అన్కి అంగి కొనియ్యే. నన్ను బట్టుకో - అమ్మా-అమ్మా-నేను సస్తున్న. నన్ను బాయిల నూకేస్తున్నరు. నేను బాయిల పడ్తున్న. నేను నాయిన తానికి పోతున్న. నాయనతానికి... నాయిన.

నే జచ్చిన...

అనుకున్న గని మల్ల దవాఖానలోనే బత్కిన.

ఎదురుగుండ అమ్మ అగుపడింది.

"అమ్మా నేను బతికిన్నే" అందామనుకున్న గని మాట రాలే. నా కడుపులకెల్లి యేడికెల్లొచ్చిందో గని యేడుపొస్తదని నాకు తెలవది. ఆడదాని కడుపల పేగులుండవనీ- యేడుపే సుట్టలు సుట్టలు సుట్టుకొని వుంటదని అమ్మ యెందుకంటదో తెల్సినట్టయింది.

ఆ యేడుపుకి దవాఖానంత వురికొచ్చిరు.

నేను బీవోషయిన!

మల్ల మతిలోకొచ్చేపటికి అమ్మ అట్లనే కూసింది.

"అమ్మా నేను బతికున్ననా? సచ్చిన్నా" అన్నా.

"నువ్వు సచ్చి బత్కినవ్ తల్లి. ఇప్పుడే యేమైంది బిడ్డా! యిట్ల యెన్నిసార్లు బత్కాలె... యెన్నిసార్లు సావాలె... ఆడదాన్కి ఒక సావుగాదమ్మ... యెన్ని సావులో సావాల తల్లి. – ఆడది శానా సావులు సస్తది" అని నన్ను గట్టిగా అదుముకుని యేడుస్తంటే నల్ల మబ్బు లెక్క బయ్యం గమ్మింది.

నాకెన్ని సావులు? ఎట్లా జావాలిరా బగమంతుడా!

గానీ నా బిడ్డకు ఒక్క సావేనంట.

అది సచ్చేపోయిందంట... బత్కకుంటనే సచ్చింది, అదేందో...

నేను సచ్చి బతికితే

నా బిడ్డ బత్కకుంటనే సచ్చింది.

నా బిడ్డ అద్రుష్టం నాకెందుకు లేదు?

❖

ఆంధ్రప్రభ, 30 మార్చి 1997